క్లుప్తంగా

నేడు తుని నియోజకవర్గంలో కలెక్టర్ పర్యటన

తుని రూరల్: తుని నియోజకవర్గంలో గురువారం జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ పర్యటించనున్నారు. ఉదయం పది గంటలకు తొండంగి మండలం, మధ్యాహ్నం ఒంటి గంటకు తుని పట్టణం, తుని మండలం, ఆ తర్వాత కోటనందూరు మండలాల్లో పర్యటిస్తారు. వర్షాకాలం కావడంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, పారిశుధ్య పరిస్థితులు, తాగునీటి వసతులు, క్లోరినైజేషన్, నాడు నేడు పనుల పరిశీలనతో పాటు తుని ఏరియా ఆస్పత్రిలో తనిఖీ చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

తుని: తుని పరిసర ప్రాంత ప్రయాణికుల సమస్యలపై గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రయాణికులు 73827 81490 నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలతో పాటు సూచనలు, సలహాలు తెలియజేయవచ్చని తెలిపారు.

మైక్రో ఆర్ట్‌పై విద్యార్థులకు అవగాహన



బెండపూడి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు మైక్రో ఆర్ట్‌పై అవగాహన కల్పిస్తున్న ఆచారి

తొండంగి: మండలంలోని బెండపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం సూక్ష్మ కళాఖండాల రూపకల్పన (మైక్రో ఆర్ట్)పై అవగాహన కల్పించారు. శ్రీకాకుళానికి చెందిన వీఎస్ఎన్ఎన్ ఆచారి వివిధ రకాల మెటీరియల్‌తో దేశనాయకులు, ఇతర ప్రముఖుల విగ్రహాలతో పాటు పలు వస్తువులు, పరికరాలను ప్రత్యక్షంగా తయారు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుతో పాటు మైక్రో ఆర్ట్‌పై కూడా దృష్టి సారించాలని సూచించారు. పాఠశాల హెచ్ఎం కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

మహిళల సంరక్షణ అందరి బాధ్యత



మురారిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ రాణి

గండేపల్లి: మహిళల సంరక్షణను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం (డీసీపీయూ) కౌన్సిలర్ బి.దుర్గారాణి పిలుపునిచ్చారు. మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని మురారిలో ప్రజలకు మహిళా, బాలికల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ, భద్రత, సాధికారత మిషన్ శక్తి పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయడం, ఆర్థిక అక్షరాస్యత, సూక్ష్మ రుణాలు ఇవ్వాలని, మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టాలని కోరారు. అనంతరం మహిళల సంరక్షణ చట్టలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగపార్వతి, జీఎంఎస్‌కే విజయలక్ష్మి, హెచ్ఎం అమ్మాజీ, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆధార్ నమోదు శిబిరాలు



ప్రత్తిపాడులో ఆధార్ అప్‌డేట్ చేయించుకుంటున్న ప్రజలు

ప్రత్తిపాడు: మండల పరిధిలోని గ్రామాల్లో ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నారు. స్థానిక గ్రామ సచివాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక శిబిరంలో ఆధార్ అప్‌డేషన్ చురుగ్గా సాగుతోంది. ఐదు ఏళ్ల లోపు వారికి బాల ఆధార్ , 15 నుంచి 17 ఏళ్ల లోపు వారికి బయోమెట్రిక్ అప్‌డేట్ చేస్తున్నారు. గతి పదేళ్లగా పేరు, చిరునామా, పుట్టిన తేదీల్లో ఎలాంటి మార్పులు చేయని వారు ఒరిజనల్ గుర్తింపు ధ్రువీకరణ పత్రాలతో వస్తే ప్రత్యేక శిబిరంలో ఆధార్ అప్‌డేషన్ చేస్తారని సచివాలయ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు తెలిపారు.

రికార్డు రూముల పరిశీలన

కాకినాడ సిటీ: భద్రతా పరమైన తనిఖీల్లో భాగంగా ఆర్డీఓ ఇట్ల కిశోర్ స్థానిక ఆర్డీఓ కార్యలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. రికార్డు రూముల వద్ద సీసీ కెమెరాలు పనితీరును పరిశీలించి, అధికారులకు పలు సూచనలిచ్చారు. భూ రికార్డుల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రికార్డు రూములో భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

పశువులకు చిటికె ముప్పు

- వ్యాధి సోకితే ప్రాణాలకు ప్రమాదం
- మండలంలో 33 వేలకు పైగా గొర్రెలు, మేకలు
- ఇప్పటికే 8848 మూగజీవాలకు వ్యాక్సినేషన్ పూర్తి
- గ్రామ సచివాలయాల్లో అందుబాటులో వ్యాక్సిన్లు

తొండంగి: తొలకరి ప్రారంభమైన నాటి నుంచి పాడి పశువులతో పాటు గొర్రెలు, మేకల ఆరోగ్యానికి హాని కలిగించే చిటికె వ్యాధి వ్యాప్తి చెందుతోంది. ఈ వ్యాధి నివారణకు ముందస్తుగా వ్యాక్సిన్లు వేయించాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడి పశువులు, పాల వ్యాపారంపై ఆధారపడి ఎన్నో లక్షల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి.

మండలంలో 26711 పశువులు

తొండంగి మండలంలో 26711 పశువులు ఉన్నాయి. మేకలు, గొర్రెలు 33024 వరకూ ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు గ్రామాల్లో పాడి పశువులు, గొర్రెలు, మేకలు ఉన్న ప్రతి ఇంటికీ వెళ్లి పాడి పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా నివారణకు వ్యాక్సిన్లు వేయడం పూర్తి చేశారు. కాగా ప్రస్తుతం మేకలకు, గొర్రెలకు వ్యాక్సిన్లు వేస్తున్నామని బెండపూడి పశువైద్యాధికారి బి.చైతన్య తెలిపారు. విడతల వారీగా వెటర్నరీ అసిస్టెంట్లు వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్నారు. సీజనల్ వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

చిటికె వేసే లోపే..

గొర్రెలు, మేకల్లో వచ్చే ప్రాణాంతక వ్యాధి చిటికె వ్యాధి. దీనిని ఓవర్ ఈటింగ్ డిసీజ్ అని కూడా అంటారు. చిటికె వేసేలోనే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది కాబట్టే దీనిని చిటికె వ్యాధి అంటారు. తొలకరి వర్షాల అనంతరం పచ్చికబయళ్లలో ఏపుగా పెరిగిన గడ్డి తినడం ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. గడ్డిలోని క్లాస్ట్రీడియం పెర్‌ఫ్రెంజెన్సీ క్రిమి పశువు కడుపులోకి వెళ్లి ఎప్సిలా అనే విష పదార్థాన్ని విడుదల చేస్తుంది. దీంతో ఆరోగ్యంగా ఉన్న గొర్రెలు, మేకలు అనారోగ్యం బారిన పడి ప్రాణాలు కోల్పోతాయి.

వ్యాధి లక్షణాలు ఇలా..

చిటికె వ్యాధి సోకిన గొర్రెలు, మేకల్లో జ్వరం, పళ్లు కొరకడం, చెట్టుకు లేదా గోడకు అనించి పెట్టడం, కాళ్లతో పొట్టను తన్నుకోవడం, బిగుసుకుపోవడం, అధిక విరోచనాలు వంటి లక్షణాల ఉంటాయి. రాత్రి సమయానికి ఎటువంటి లక్షణాలు లేకుండా తెల్లవారే సరికి గాలిలో ఎగిరిఎగిరి పడి చిటికె సమయంలోనే మరణిస్తాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వ్యాధిని గుర్తించిన వెంటనే యాంటీ డయేరియా పౌడర్‌ను తాగించాలి. పశువులకు సిలైన్లు పెట్టించాలి. ఈవిధంగా మూడు నుంచి ఐదు రోజుల పాటు వైద్యం అందించాలి. వ్యాధి నివారణకు తొలకరి వర్షాలకు ముందే నివారణా వ్యాక్సిన్ వేయించాలి.



బెండపూడిలో మేకలకు టీకాలు వేస్తున్న వెటర్నరీ వైద్యులు

నట్టల నివారణ

గొర్రెలు, మేకలకు సాధారణంగా జలగలు, పాములు, బద్దే పురుగులు, నట్టలు అనే అంతర పరాన్నజీవుల వలన వ్యాధులు వస్తుంటాయి. ఈ జీవులు ఆహారం, నీటి ద్వారా కడుపులోకి ప్రవేశించడంతో నట్టల వ్యాధి వ్యాప్తి చెందుతుంది. ఈ పరాన్నజీవులు పశువుల కడుపులో సంతానాభివృద్ధి చేసుకోవడంతో వ్యాధి వ్యాప్తి చెందడమే కాకుండా పశువులకు రక్త హీనత, కడుపు ఉబ్బరం, అరుగుదల లేకపోవడం, పారుడు, ఎదుగుదల లోపించడం వంటి లక్షణాలను కలిగిస్తాయి. తద్వారా నీరసం, నిస్సత్తువతో వ్యాధి నిరోధకశక్తి తగ్గిపోవడం వలన పశువులకు ఇతర వ్యాధులు త్వరగా సోకుతాయి. కాగా రైతులు ప్రతి మూడు నెలలకు ఒకసారి పశువులతో ఈ నట్టల నివారణ మందు తాగించడం ద్వారా అంతర పరాన్నజీవుల వలన కలిగే వ్యాధులను అరికట్టవచ్చు. తద్వారా గొర్రెలు, మేకలు ఆరోగ్యంగా ఉంటాయి.

వ్యాక్సిన్ వేస్తున్నాం



గ్రామ సచివాలయాల్లోని వెటర్నరీ అసిస్టెంట్లు పశువులు ఉన్న రైతుల ఇళ్లకు వెళ్లి మూగజీవాలకు వ్యాక్సిన్లు వేస్తున్నారు. గొర్రెలకు, మేకలకు కచ్చితంగా ఈ ప్రాణాంతక వ్యాధి రాకుండా వ్యాక్సిన్ వేయించాలి. 8848 గొర్రెలు, మేకలకు చిటికె వ్యాధి నివారణకు టీకాలు వేశాం.

–బి.చైతన్య, పశువైద్యాధికారి బెండపూడి, తొండంగి మండలం

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



ధర్మవరంలో సంప్రదాయ క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రత్తిపాడు రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈఓ వి.రాజబాబు సూచించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ధర్మవరం, ఒమ్మంగి గ్రామాల్లో బుధవారం సాంప్రదాయ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వివిధ విభాగాల్లో నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకన్న, కె.చినరామమూర్తి, సీఆర్పీ రాంజీ, ఉపాధ్యాయులు, పీడీలు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



తుని ఏరియా ఆసుపత్రి ట్రామాకేర్ వార్డులో రోగులు



ఊడిపడిన శ్లాబు

తుని: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని ట్రామాకేర్ వార్డులో శ్లాబ్ వర్షాలకు ఊడి పడంది. మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఇన్‌పేషెంట్లు నిద్రలో ఉండగా శ్లాబు ముక్క పడడంతో ఆందోళన చెందారు. వార్డులో చికిత్స పొందుతున్న ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వర్షాలకు శ్లాబ్ పెచ్చు ఊడిపడిందని ఆసుపత్రి సూపరింటిండెంట్ స్వప్న తెలిపారు. ఆ వార్డులో ఉన్న రోగులకు వేరే గదిలోకి మార్చామన్నారు. త్వరలో మరమ్మతులు చేపడతామని చెప్పారు.

ముందు జాగ్రత్తలతో అధిక దిగుబడులు

కిర్లంపూడి: రైతులు ఖరీఫ్ వరి నాట్లు వేయడానికి ముందు తగిన జాగ్రత్తలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ జోకా అమృత అన్నారు. మండలంలోని చిల్లంగిలో రైతు కంపరపు నాగేశ్వరరావు పొలంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ అమృత మాట్లాడుతూ వరినాట్లు వేసే ముందు దమ్ములో డీఏపీ, పొటాష్ ఎరువులు వేసుకోవాలని రైతులకు సూచించారు. వరినారు సుతలు తుంచి నాటుకోవాలన్నారు. బెంగాలీ కూలీలతో ఊడిపించే రైతులు నారుమడి వేసిన 21 రోజుల్లో నాట్లు పూర్తి చేయాలన్నారు. అలాగే కౌలు రైతులు జేఎస్‌జీ గ్రూపులుగా ఏర్పడితే బ్యాంకు రుణాలు ఇప్పిస్తామని తెలిపారు. అనంతరం నారులో వచ్చే తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏలు ఆకుల సురేష్, రాజాల అబ్బాయి, రైతులు కంపరపు నాగేశ్వరరావు, కాళ్ళ భద్రాచలం, నైదాన రఘు, తదితరలు పాల్గొన్నారు.



చిల్లంగిలో రైతులకు తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఏఓ అమృత

వరినాట్లులో జాగ్రత్తలు పాటించాలి

శంఖవరం: వరి నాట్లు వేసే సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. మండలంలోని జి.కొత్తపల్లిలో వరి నారుమడులు, దమ్ము చేస్తున్న పొలాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి నారు నాటే సమయంలో ముందుగా దమ్ములో యూరియా, పోటాషియం, సూపర్ ఫాస్పేట్ వేసుకోవాలన్నారు. భూసారం తక్కువగా ఉన్న పొలాల్లో వరి కుదుళ్లు ఎక్కువుగా నాటాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు క్రాంతి పాల్గొన్నారు.



జి.కొత్తపల్లిలో వరి నారుమడులను పరిశీలిస్తున్న ఏఓ గాంధీ

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కిర్లంపూడి: ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ తుమ్మలపల్లి సాయిగుణశేఖర్ సూచించారు. మండలంలో రామచంద్రపురం ఏంపీయూపీ పాఠశాల విద్యార్థులకు బుధవారం పుస్తకాలు, బ్యాగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు పుస్తకాలు, బ్యాగులు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం భోజనం పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బండారు ప్రసాద్, హెచ్ఎం వీరభద్రరావు, గంధం రాఘవ, దేవరడి సీత, గంధం చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాల పంపిణీ

గండేపల్లి: మండలంలోని ఎన్టీ రాజాపురం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం యూనిఫాం, పుస్తకాలు, బ్యాగులు, బూట్లు అందజేశారు. హెచ్ఎం ఉండవల్లి భాస్కర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బిక్కిన దేవి దుర్గ గంగాధర్, మాజీ ఉపసర్పంచ్ పాలచర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎన్టీ రాజాపురంలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేస్తున్న నాయకులు

పోరాటయోధుడు రాజారావుకు ఘన నివాళులు

జగ్గంపేట: ప్రతిఘటన పోరాటయోధుడు, ఆదివాసీ హక్కుల కోసం అలుపెరగని పోరాటాలు చేసిన నేత చాగంటి రాజారావు వర్థంతి సభ బుధవారం జగ్గంపేటలో జరిగింది. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి మరుకుర్తి ఏసు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్మిక సంఘాల నేత గుబ్బల ఆదినారాయణమూర్తి ముఖ్య అతిథులు పాల్గొన్నారు. తొలుత రాజారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజారావు కార్మికులు, ఆదివాసీలు, కర్షకుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ఆయన సేవలు, పోరాట స్ఫూర్తిని కొనియాడారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని కార్మిక సంఘం నేత గుబ్బల ఆదినారాయణమూర్తి అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పని చేస్తోందని విమర్శించారు. నిధుల కేటాయింపులో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఏపీ ఎంపీలు కేంద్రాన్ని నిలదీయాలని కోరారు.



రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

నాటి క్రీడలను నేటి తరానికి పరిచయం చేయాలి

ఏపీఎస్పీ హైస్కూల్ స్పోర్ట్స్ డేలో డీఈఓ రమేష్



ఎస్ఎస్ఆర్‌కే స్కూలో నిర్వహించిన బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కాకినాడ రూరల్: అంతరించిపోతున్న క్రీడలు తొక్కుడు బిళ్ళ, ఏడు పెంకులాట, కోతి కొమ్మచ్చి, అష్టాచమ్మా, ఖోఖో, కబడ్డీ వంటి క్రీడలను నేటి తరానికి పరిచయం చేసేందుకు శిక్షా సప్తాహ్‌లో భాగంగా మూడో రోజు ఏర్పాటు చేసిన స్పోర్ట్స్‌డే దోహదం చేస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ పేర్కొన్నారు. ఏపీఎస్పీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హైస్కూల్ ప్లస్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. క్రీడోత్సవాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులకు స్టీల్ ప్లేట్లను పంపిణీ చేసి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ కె.గాయత్రి, ఏఎంఓ రామారెడ్డి, ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాస్, జోగిరెడ్డి, పాల్ రాజు, పీడీలు కిరణ్‌కుమార్, త్రిమూర్తులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంప్రదాయ క్రీడలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): స్థానిక తిలక్ స్ట్రీట్‌లో ఎస్ఎస్ఆర్‌కే మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా బుధవారం విద్యార్థులకు సాంప్రదాయ క్రీడలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం డి.గౌరీశంకర్ అధ్యక్షత వహించగా, కాకినాడ అర్బన్ ఎంఈఓ రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరం అన్నారు. క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంపొందించడానికి దోహద పడతాయన్నారు. ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బాడీ బిల్డింగ్, తొక్కుడు బిళ్ల, కుంటాట, పులిమేక, అష్టాచెమ్మ, వైకుంఠపాళి తదితర క్రీడలు నిర్వహించారు. ఈ క్రీడల్లో 600 మంది పాల్గొన్నారు. ఈ పోటీల నిర్వహణలో పీఈటీ సూరిబాబు, ఉపాధ్యాయులు పుష్పగిరి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమేవ జయతే

- గ్రామాల్లో ఉత్సాహంగా స్వచ్ఛత వారోత్సవాలు
- ప్రజలకు శుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ఏలేశ్వరం: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఎ.మల్లిఖార్జునరావు సూచించారు. మండలంలోని సిరిపురం, యర్రవరం గ్రామాల్లో బుధవారం స్వచ్ఛత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమన్నారు. స్వచ్ఛతా కార్యక్రమాల్లో భాగంగా ప్రతినెలా నాలుగో వారం స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛతా వారోత్సవాలకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జె.శ్రీనివాస్, ఉద్యానశాఖ అధికారి శ్రీవల్లీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని మున్సిపల్ కమిషనర్ కె.శివప్రసాద్ అన్నారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. స్థానిక కోనేటిబడి ఆవరణలో కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, యండగండి నాగబాబు, కోనాల వెంకటరమణ, రాయుడు చిన్నా మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం ఆవశ్యకతను మున్సిపల్ కమిషనర్ వివరించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో మొక్క నాటుతున్న కౌన్సిలర్లు

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

తుని: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటరావు అన్నారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా స్థానిక 5, 6 వార్డుల్లో బుధవారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. పిచ్చి మొక్కలను తొలగించి డ్రైన్లను శుభ్రపరిచారు. లోతట్టు ప్రాంతాల్లో బ్లీచింగ్, దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. అనంతరం పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఈ ప్రకాశరావు, ఏఈ ప్రసన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



తునిలో పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

గ్రామల పరిశుభ్రతే ధ్యేయం

కిర్లంపూడి: గ్రామాల పరిశుభ్రతే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు అన్నారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా మండలంలోని వేలంకలో బుధవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది కాలువలు, రోడ్లకు ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలను తొలగించారు. కుళాయిలకు మరమతులు చేయించడంతో పాటు డ్రైన్‌లను శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లారు. అనంతరం స్థానిక నాయకులు, అధికారులు కలిసి కాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటారు.

జగ్గంపేట సీహెచ్‌సీలో స్వచ్ఛభారత్

జగ్గంపేట: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛతా వారోత్సవాల్లో భాగంగా ఆసుపత్రి ఆవరణలో పరిసరాలను పరిశుభ్రం చేయడానికి ప్రతిరోజూ గంటన్నర సమయం కేటాయిస్తున్నారు. వైద్య సేవలకు ఆటకం లేని సమయంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ టి.ప్రణీత్ ఆధ్వర్యంలో వైద్యులు మాధురి, సంధ్య, వినుష్, భాగ్యలక్ష్మి, తేజ, వైద్య సిబ్బంది పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. పిచ్చిమొక్కలు తొలగించి బ్లీచింగ్ చల్లారు. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో ప్రతిఒక్కరూ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డాక్టర్ ప్రణీత్ సూచించారు.



జగ్గంపేటలో సీహెచ్‌సీ ఆవరణను శుభ్రం చేస్తున్న వైద్యులు, సిబ్బంది

ఆర్‌ఓబీ నిర్మాణానికి సహకరించాలి

ఆర్డీవో ఇట్ల కిషోర్

పిఠాపురం: మున్సిపాలిటీ పరిధిలోని ఉప్పాడ సెంటర్‌లో నిర్మించతలపెట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ కోరారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి స్థల యజమానులతో పిఠాపురం తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా అవసరాల దృష్ట్యా త్వరితగతిన ఆర్‌ఓబీ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించి సుమారు 6 ఎకరాల భూమి అవసరం కాగా సుమారు రెండు ఎకరాల ప్రైవేటు భూమి సేకరించామన్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందజేస్తామని తెలిపారు. ఆర్‌ఓబీ నిర్మాణానికి స్థల యజమానులు, దుకాణదారులు సహకరించాలని కోరారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ఆదేశించారని, ఈ మేరకు త్వరితగతిన నిర్మాణ పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో రహదారులు, భవనాల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆశ్రిత, డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రారెడ్డి, నాగేశ్వరరావు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.



స్థల యజమానులతో మాట్లాడుతున్న ఆర్డీవో కిషోర్

రికార్డుల భద్రతలో రాజీలేదు

- తేడా వస్తే చర్యలు తప్పవు
- ఆర్డీఓ జేఎస్ రామారావు

పెద్దాపురం: రెవెన్యూ రికార్డుల భద్రతలో ఎటువంటి తేడాలు వచ్చిన సహించేది లేదని ఆర్డీఓ జేఎస్ రామారావు హెచ్చరించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఉన్న రెవెన్యూ రికార్డులను బుధవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల పరిధిలో సంవత్సరాల వారీగా అన్ని రికార్డులకు సంబంధించిన ప్రతి ఫైల్ కార్యాలయంలో ఉండాల్సిందేనన్నారు. ఫైళ్లను భద్రపరచాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఎల్‌సీసీ, అస్సైన్‌మెంట్ ల్యాండ్, ఇళ్ల స్థలాలకు సంబంధించిన రికార్డులు మండలాల వారీగా ఉన్న డేటా డివిజన్ కేంద్రంలో ఉంచాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ప్రతి రోజూ రికార్డుల పర్యవేక్షణకు ఇద్దరు సిబ్బందితో రాత్రిపూట ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రికార్డుల భద్రతపై నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన ఆయా గదుల్లో ఉన్న రికార్డుల భద్రతను పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట కార్యాలయ డీటీ భానుకుమార్, సిబ్బంది ఉన్నారు.